
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 అక్టోబర్ 2025



రాష్ట్రస్థాయి పోటీలకు బుట్టాయగూడెం విద్యార్థిని


పోటీలకు ఎంపికైన హేమశ్రీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక కరాటం కృష్ణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ విద్యార్థిని రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సుబ్బలక్ష్మి తెలిపారు. బుధవారం పెదవేగిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో జరిగిన అండర్-19 హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి ఎంపికల్లో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.హేమశ్రీ విశేష ప్రతిభ కనబరిచి హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. త్వరలో ప్రకాశం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామోపాధ్యాయులు ఆర్.సీతారాం, టి.శ్రీనివాసరావును సుబ్బలక్ష్మితోపాటు తోటి సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

అడుగడుగునా గోతులు.. తప్పని అవస్థలు!

- ప్రమాదకరంగా అప్పలరాజుగూడెం రోడ్డు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- గగ్గోలు పెడుతున్న వాహనదారులు
- భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ఛిద్రం
- గోతుల్లో మొక్కలు నాటి వ్యకాస వినూత్న నిరసన


గోతుల్లో బోల్తా పడిన లారీ (ఫైల్‌ఫొటో)


గోతులతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెం నుండి అప్పలరాజుగూడెం వరకు ఆర్అండ్‌బి రోడ్డు అడుగడుగునా గోతులతో నిండి ఉండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. భారీ గోతుల వల్ల పెద్ద వాహనాలు సైతం బోల్తా పడుతున్నాయి. దీంతో ఏక్షణాన ఎటువంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి అప్పలరాజుగూడెం రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఓపక్క రోడ్లు అభివృద్ధి చేస్తున్నాం.. గోతులు పూడ్చుతున్నామని కూటమి ప్రభుత్వం చెబుతుందేగాని, ఆచరణలో మాత్రం కన్పించడం లేదని, అందుకు అప్పలరాజుగూడెం రోడ్డే ఉదాహరణ అని చెప్పొచ్చు. రోడ్డు అధ్వానంతో సాఫీగా రాకపోకలు సాగించలేకపోతున్నామని, గోతుల వల్ల వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు అభివృద్ధి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని మక్కినవారిగూడెం నుండి బండివారిగూడెం, అప్పలరాజుగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురంలో బైపాస్‌ను కలిపే ఆర్అండ్‌బి రోడ్డు ఛిద్రమై గోతులమయంగా మారింది. సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు మండలంలోని పలు గ్రామాల నుండి జంగారెడ్డిగూడెం, రాజమండ్రి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఉంది. అయితే నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు ప్రస్తుతం వాహనాదారుల ప్రయాణాలకు ప్రాణసంకటంగా మారింది. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడంతో రోడ్డు మరింత దయనీయంగా తయారైంది. ఇటీవల ఆర్అండ్‌బి అధికారులు కొంతమేర రోడ్డు మరమ్మతులు నిర్వహించినప్పటికీ వాటి నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో మరమ్మతులు చేసిన కొద్దిరోజుల్లోనే దెబ్బతిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు అధ్వానంపై ఇటీవల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అప్పలరాజుగూడెం ప్రధాన సెంటర్లో రోడ్డుపై ఉన్న పెద్ద గోతిలో కొబ్బరి, అరటి మొక్కలు నాటి ఆందోళన సైతం నిర్వహించారు.

భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు మరింత ఛిద్రం

అప్పలరాజుగూడెం మీదుగా మక్కినవారిగూడెం, ఎర్రగుంటపల్లి, సీతానగరం గ్రామాలవైపు నుండి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లేందుకు ఈ రోడ్డు మార్గం దగ్గర కావడంతో మండలం మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. జీలుగుమిల్లి వద్ద ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను తప్పించుకునేందుకు కూడా ఈ మార్గంలో ఇసుక లారీలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటుందని జనం వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటో, కార్లు వంటివి తిరిగే పరిస్థితి లేకుండాపోయిందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి, భారీ వాహనాల రాకపోకలను నియమంత్రించాలని కోరుతున్నారు.

అప్పలరాజుగూడెం రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలి..



బి.నవీన్, పుట్రేపు

అప్పలరాజుగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లాలంటే భయమేస్తోంది. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. రోడ్డు పాడై ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలి.

రోడ్డు అధ్వానంతో వాహనదారులకు అవస్థలు..



గుడెల్లి వెంకట్రావు, ఎపి వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి

మండలంలోని అప్పలరాజుగూడెం రోడ్డు గోతులమయమై అధ్వానంగా ఉంది. వాహనదారులు నానావస్థలు పడుతున్నారు. ఇటీవల ఆర్అండ్‌బి అధికారులు కొంతమేర రోడ్డు మరమ్మతులు చేశారు. అయితే నాణ్యత లేకపోవడంతో మళ్లీ రోడ్డు ధ్వంసమైంది. భారీ వాహనాల రాకపోకలు కూడా నిలిపేయాలి. పాడైన రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలి.

వికలాంగులకు ఆత్మస్థైర్యం కల్పించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

సమాజంలో వికలాంగులు ఆత్మస్థైర్యంతో జీవించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జాతీయ వైట్‌కేన్ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ వద్ద ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని, వాటి జీవన ప్రమాణాలు మెరుగు పర్చుకోవాలన్నారు. అర్హులైన ప్రతి వికలాంగునికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని, ఇంకా ఎవరైనా సంక్షేమ కార్యక్రమాల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఏలూరు కలెక్టరేట్ ఆవరణలోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్, విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాధారాణి, ఏలూరు జిల్లా అధ్యక్షులు జిడివిఎస్.వీరభద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మదన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.కర్ణుడు, కోశాధికారి వై.రమేష్ పాల్గొన్నారు. కలెక్టరేట్ నుండి ప్రారంభమైన ర్యాలీ జన్మభూమి పార్క్ మీదుగా ఏటిగట్టు నుండి తిరిగి కలెక్టరేట్‌కు చేరుకుంది.

ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి అథారిటీ యాక్టును అనుసరించి జిల్లాలోని ఆక్వా చెరువులు అప్సడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఆక్వాసాగులో ఉన్న పది మండలాల్లో గ్రామాలవారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. రిజిస్ట్రేషన్లు కనీసం 50 శాతం పూర్తి చేయలేకపోయారని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. టార్గెట్ పూర్తి చెయ్యని అధికారులను, అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో మకాం వేసి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, ఏలూరు, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మొత్తం పది మండలాల్లో లక్షా 49 వేల 828 ఎకరాల్లో ఆక్వా విస్తరించి ఉందని, ఇప్పటివరకు 52,613 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఇంకా 97,215 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. ఎల్‌పిఎం అప్డేషన్ వెంటనే చేసి గురువారం సాయంత్రానికి కనీసం ఎనిమిది వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసి ప్రగతి చూపించాలని ఆదేశించారు. కొల్లేరు భూములు వైల్డ్‌లైఫ్ పరిధిలో ఉన్నందున అక్కడ లైసెన్స్ ఇవ్వొద్దన్నారు. సమావేశంలో విజయవాడ మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ షేక్ లాల్‌మహ్మద్, జిల్లా మత్స్యశాఖ డిడి బి.నర్సయ్య, సహాయ సంచాలకులు బి.రాజ్‌కుమార్, కె.రవికుమార్, మండల, గ్రామాల మత్స్యశాఖ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

అవగాహన, అప్రమత్తతతోనే కేన్సర్ నివారణ


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అవగాహన, అప్రమత్తత ద్వారానే కేన్సర్‌ను ఎదుర్కోగలమని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం అన్నారు. ఆశ్రం ఆసుపత్రిలో ఆశ్రం కేన్సర్ కేర్ ఆధ్వర్యంలో రొమ్ము కేన్సర్‌పై అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి డిఎంహెచ్ఒ అమృతం మాట్లాడుతూ రొమ్ము కేన్సర్ ప్రస్తుత కాలంలో ఎక్కువగా ప్రబలుతోందన్నారు. అవగాహన లేకపోవడం వల్ల చాలామంది స్త్రీలు ఇబ్బందులు పడి, ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు అవగాహనా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని, అవగాహనే ఆయుధమని అన్నారు. ఆశ్రం హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ కె.హనుమంతరావు మాట్లాడుతూ ఆశ్రం కేన్సర్ కేర్ ద్వారా ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆశ్రం కేన్సర్ కేర్ తరపున ప్రాథమిక స్థాయిలో కేన్సర్‌ను గుర్తించేందుకు స్క్రీనింగ్ శిబిరాలను, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణస్థాయిలో నిర్వహించే శిబిరాల్లో పలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కేన్సర్ చికిత్సను ఉచితంగా, ప్రత్యేక రాయితీలతోనూ చేస్తున్నామని వివరించారు. ఆశ్రం కేన్సర్ కేర్ ద్వారా రొమ్ము కేన్సర్ చికిత్స పొందిన జి.లలిత, బి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన సమయంలో చికిత్స తీసుకోవడం వల్ల తాము మహమ్మారిపై విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ సింధు, డాక్టర్ సారధి, సర్జికల్ అంకాలజిస్ట్ శైలజ, చంద్రశేఖర్, రేడియేషన్ అంకాలజిస్ట్ కణ్మణి, మౌనిక, ధాత్రి, ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వేణుగోపాల్‌రాజు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ పి.హరీష్ గౌతమ్, గ్రూప్ సిఒఒ రాజరాజన్, ఇతర వైద్యులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రేపల్లెవాడ-పోలవరం రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం
- సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్రలో నేతలు



గతుకుల రోడ్డుపై సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం-రేపల్లెవాడ రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. రేపల్లెవాడ ప్రధాన కూడలి వద్ద సీనియర్ నాయకులు బోరగం భూచంద్రరావు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర బృందానికి గ్రామగ్రామాన అక్కడి స్వాగతం పలికి తమ సమస్యలు తెలుపుకున్నారు. ఈ పాదయాత్ర రేపల్లెవాడ, చేగొండపల్లి, గుంజవరం, గార్లగొయ్యి, కొమ్ముగూడెం, ఇటుకలకోట, కచేరి (కార్మెల్ పురం) మీదుగా పోలవరం ఏటిగట్టు వరకు పాదయాత్ర నిర్వహించారు. యాత్ర ముగింపు సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ రేపల్లెవాడ నుండి పోలవరం రహదారిని 20 ఏళ్ల కిందట నిర్మించారని గుర్తు చేశారు. ప్రభుత్వాలు, పాలకులు, ప్రజాప్రతినిధులు మారుతున్నా ఈ రహదారి నిర్మాణం మాత్రం అలానే ఉందన్నారు. రోడ్లు అభివృద్ధి చేయకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. 2022వ సంవత్సరంలో రూ.6 కోట్ల నిధులు కేటాయించినా పనులు మాత్రం జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లు గుంతల్లేకుండా చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో కానరావడం లేదని, దీనికి ఈ రోడ్డే నిదర్శనమని అన్నారు. ఈ రహదారి వెంబడి నాలుగు హైస్కూళ్లు, ఒక ప్రభుత్వాస్పత్రి, మండల కార్యాలయాలు ఉన్నాయని, ప్రజలు నిత్యం ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తారని తెలిపారు. మండల కేంద్రానికి తరచూ వచ్చే ప్రజలు నానావస్థలు పడుతున్నారని వివరించారు. నెల రోజుల్లో ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి యాత్ర ముగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు తామా బాలరాజు, మడివి చలపతిరావు, టి.శాంతికుమారి, గోకురీ పాండవులు, కృష్ణ, నాగమణి, గంగాదేవి, పోసిబాబు, ఇంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆశీర్వాదం వల్లే డిజిపి స్థాయికి చేరా

కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్ - స్వగ్రామం వీరవాసరంలో ఘనంగా పౌర సన్మానం


కేరళ డిజిపి ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులకు పౌరసన్మానం చేస్తున్న గ్రామస్తులు



మాట్లాడుతున్న డిజిపి ఆజాద్ చంద్రశేఖర్


మాట్లాడుతున్న జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ

ప్రజాశక్తి - వీరవాసరం

'నా గ్రామస్తులు, నా గురువుల ఆశీస్సులు, నా తల్లిదండ్రుల త్యాగఫలం, నా సోదరుల సహకారం, నా స్నేహితుల ప్రేమ వల్లే నేను డిజిపి స్థాయికి ఎదిగాను' అని వీరవాసరం వాసి, ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వపు విద్యార్థి, ప్రస్తుత కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్ తెలిపారు. కేరళ డిజిపి ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులను గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా పౌర సన్మానం చేశారు. ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆజాద్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వీరవాసరం గ్రామం గొప్పతనం చెప్పాలంటే 1981లో పదో తరగతి, 1983లో ఇంటర్ చదువుకున్న ముగ్గురు విద్యార్థుల్లో తనతోపాటు ఎంవి.సుబ్బారెడ్డి, చికిలే సుభాకర్ ఆలిండియా సర్వీస్‌కు ఎంపికయ్యామని తెలిపారు. సుబ్బారెడ్డికి త్రిపుర, సుభాకర్ సిక్కిం, తాను కేరళకు వెళ్లామని వివరించారు. ఆనాడు తాము వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడం బాధ అన్పించినా వీరవాసరం ఖ్యాతిని దేశం నలుమూలలా వ్యాపింపజేశామని సంతృప్తి దక్కిందన్నారు. పదవులకు ప్రాధాన్యత ఇవ్వకుండా మంచి వ్యక్తిత్వం, సేవాగుణంతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ప్రతిఒక్కరికీ ఉన్నదే ఒకే సమయమని, దీన్ని సద్వినియోగం చేసుకుని మనం అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి కష్టపడడమే ఆలోచనగా ముందుకు సాగాలని తెలిపారు. ఫిజికల్ ఎనర్జీ, మెంటల్ స్పిరిట్యువల్ ఎనర్జీని అర్థం చేసుకుని ఉన్న సమయాన్ని సక్రమంగా వినియోగించుకుంటే అనుకున్నది తప్పనిసరిగా సాధించుకోగలుగుతామన్నారు. నేటి యువతకు, విద్యార్థులకు, తాను చెప్పేది ఒకటే అని, తాను విద్యార్థి దశలో ఒక సాధారణ విద్యార్థినని, అంత తెలివితేటలు లేవని తెలిపారు. అయితే నిరంతర శ్రమతోనే తాను ఈ స్థాయిలో మీ ముందున్నానన్నారు. ప్రతిఒక్కరూ కృతజ్ఞతతో ఉండాలని, అనవసర విషయాలు వదిలేయాలని అన్నారు. ఈ సమాజానికి ఎలా ఉపయోగపడాలనే ఆలోచనతో మెలగాలన్నారు. ఏఒక్కరూ మరొకరితో పోల్చుకోకూడదని సూచించారు. గురువులు చెప్పింది చదువుకుంటూ, తన తండ్రి చెప్పిన మాటలకు అనుగుణంగా తన కృషి వల్లే తాను ఈ సర్వీసులో ఉన్నానని చెప్పారు. పోలీస్ సర్వీస్‌లో ఉండటమే కాదని, అందులోని లోటుపాట్లను సరి చేసుకుంటూ ఒక టీమ్‌గా అందరినీ ముందుకు తీసుకెళ్లడంలో తాను విజయం సాధించానని చెప్పారు. ఈ సర్వీస్‌లో చేరిన నాటి నుండి తన తల్లి తనతోపాటే ఉండడం తనకు అత్యంత ఆనందకరమైన అంశమన్నారు. ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యతగా పోలీస్ ఉండాలన్నారు. కేరళ రాజకీయంగా, సాంస్కృతికంగా, సంఘ పరంగా బాగా చైతన్యం ఉన్న రాష్ట్రమని, అక్కడ పోలీస్‌గా ఉండటమంటే ఒక ఛాలెంజ్ అని తెలిపారు. ఆ పోలీస్‌గానే పారదర్శకంగా, మానవీయంగా, ప్రజల పక్షం ఉండే విధంగా ఉన్నానని, అందుకు అనుగుణంగానే అక్కడ పని చేస్తున్నానని తెలిపారు. తాను ఎంత దూరంలో ఉన్నా ప్రతి విషయంలోనూ మన గ్రామ గుండె చప్పుడు ప్రతి క్షణం తనతోపాటు ఉంటుందన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన ఎంఆర్‌కె హైస్కూల్ నేడు ఒక వటవృక్షంలా ఎదిగిందన్నారు. విద్యాదాత మద్దాల రామకృష్ణమ్మ ముందుగానే ఊహించి ఎంతో త్యాగం చేసి ఈ హైస్కూల్‌ను ఇక్కడ స్థాపించారన్నారు. నేటి తరం పుట్టినప్పటి నుండి టెక్నాలజీలో మునిగి తేలుతున్నారన్నారు. అయితే ఈ టెక్నాలజీని సద్వినియోగం చేసుకునే విషయంలో పిల్లలకు తల్లిదండ్రులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ విప్లవం, మాదక ద్రవ్యాలు రాబోయే తరానికి ప్రమాదకరంగా మారకూడదన్నదే లక్ష్యంగా పోలీస్ వ్యవస్థ పని చేస్తుందన్నారు. ఇంత మందిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఈ కార్యక్రమం చేశారంటే అది వీరవాసరం ఘనతగా తాను గర్వపడుతున్నానని తెలిపారు. వీరవాసరం నుంచి కేరళకు ఎవరు వచ్చినా తన అతిథులుగా భావిస్తానన్నారు. తుని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ భూదాన ఉద్యమంతో స్ఫూర్తి పొంది తన యావదాస్తిని విద్యా సంస్థల ఏర్పాటుకు దానం చేసిన మద్దాల రామకృష్ణమ్మను, జాతీయోద్యమ కవి, సంఘ సంస్కర్త, వీరవాసరం వాసి చిలకమర్తి లక్ష్మీనరసింహ పంతులును మర్చిపోకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వ సైన్సు సలహాదారునిగా, రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న సైన్స్ చక్రవర్తి సర్వేశ్వరశర్మ, చట్టసభలకు వెళ్లిన చేగొండి హరిరామజోగయ్య, బాడిగ రామకృష్ణ, పీతల సుజాత ఈ స్కూల్ విద్యార్థులే అని గుర్తు చేశారు. ఆలిండియా సర్వీస్‌లో ప్రస్తుతం రావాడ ఆజాద్ చంద్రశేఖర్‌తోపాటు తాడేపల్లి జేసుదానం, చిటికెన సత్యనారాయణ, ఎంవి.సుబ్బారెడ్డి, చికిలే సుభాకర్, చింత మధుసూదనరావు ఉన్నారని, దేశ, విదేశాల్లో ఎంఆర్‌కె పూర్వపు విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. వీరంతా హైస్కూల్ పేరు నిలబెడుతున్నారని తెలిపారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ వీరుల వాసం వీరవాసరం అని కొనియాడారు. విద్యార్థులంతా ఆజాద్ చంద్రశేఖర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగు స్తంభాలైన న్యాయం, పాలన, జర్నలిజం, చట్టం వీటిలో జర్నలిజం మినహా మూడు స్తంభాలు ఒకే వేదికపై ఉన్నాయన్నారు. ఇదే ఐక్యతతో గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులను గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా విశిష్ట అతిథులు వీరవల్లి గోపాలకృష్ణ, పీతల సుజాత, మద్దాల సత్య పద్మను గ్రామస్తులు సత్కరించారు. డిజిపి ఆజాద్ చంద్రశేఖర్ చేతుల మీదుగా తన గురువులను సత్కరించారు. 2024-25 పదో తరగతి పరీక్షల్లో హైస్కూల్ టాపర్‌గా నిలిచిన బొక్కా దేవిశ్రీకి ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ రూ.పది వేలు బహుమతి, సెక్షన్లవారీగా 17 మందికి రూ.రెండు వేలు చొప్పున నగదు బహుమతి, పార్డ్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

అలివేరు నుంచి సాగునీరు విడుదల


నీరు విడుదల చేస్తున్న బాలరాజు, శ్రీనివాస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని అలివేరు గుబ్బల మంగమ్మ జలాశయం నుండి సుమారు 70 ఎకరాల ఆయకట్టుకు సాగునీరును పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బోరగం శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమని, కష్టపడి పంటలు పండించే రైతులకు సమయానికి నీరు అందించడం మన బాధ్యతని అన్నారు. అలివేరు ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల కావడంతో ఈ ప్రాంత రైతులకు ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మోగపర్తి సోంబాబు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు, గ్రీన్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, జిఎస్ఎన్.నాయుడు, జనసేన నాయకులు కోన కుమార్‌నాయుడు, తీగల గోపాలకృష్ణ, మనోహర్, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు అంతా కొనాలి

లోగ్రేడ్ వర్జీనియా పొగాకు కిలో ధర రూ.300 ఇవ్వాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లోగ్రేడ్ వర్జీనియా పొగాకు కిలోకు రూ.300 ధర కల్పించాలని, రైతుల వద్దనున్న వర్జీనియా పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం తాడువాయిలో సంఘం మండల సమావేశం అనపర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ లో గ్రేడ్ వర్జీనియా పొగాకుకు కనీస ధర కల్పించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నోబిడ్ పేరుతో తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపడంతో రవాణా ఖర్చుల భారం రైతులకు పెరిగిపోతుందన్నారు. ఇంకా రైతుల వద్ద పొగాకు నిల్వలు ఉన్నాయని, ఈ పొగాకును ఎప్పటికి కొనుగోలు చేస్తారో అర్థం కాక రైతులు అయోమయ స్థితిలో ఉన్నారని చెప్పారు. ఈ సంవత్సరం వర్జీనియా పొగాకు మంచి ధర వచ్చిందని ఒకవైపు ప్రచారం చేస్తున్నా, ఆచరణలో ఆవిధంగా ధర రాకపోగా అనేకమంది రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు నాట్లు సీజన్ ప్రారంభమైందని, ఉన్న పొగాకు అమ్ముకోవాలో, తోటలు వేసుకోవాలో రైతులకు తెలియడం లేదన్నారు. వర్జీనియా పొగాకు కొనుగోలు వేగవంతం చేసి, లోగ్రేడ్ పొగాకుకు కనీస ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న రైతుసంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభ విజయవంతం కోరుతూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టినట్లు చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల ఉపాధ్యక్షులు బోడిక రామచంద్రరావు, జల్లి ప్రసాద్, మాదారపు రవికుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నేతలు

సచివాలయం, ఆర్‌బికె భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

మండలంలోని అలివేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె భవనాలను పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సచివాలయం, ఆర్‌బికె భవనాలు గ్రామాభివృద్ధికి కొత్త దశను తెస్తాయన్నారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన


ఏర్పాటు చేసిన స్తంభం

ప్రజాశక్తి – ముదినేపల్లి

ఎట్టకేలకు విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. ముదినేపల్లిలోని అంబేద్కర్ నగర్‌లోని మంచినీటి చెరువుగట్టుపై విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారిన వైనంపై ఇటీవల ప్రజాశక్తిలో వాలిన విద్యుత్ స్తంభంతో భయం అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఎఇ పూర్ణచంద్రరావు చెరువులో ఒరిగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తీసివేయించి దాని స్థానంలో నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వీధి దీపం కూడా అమర్చారు. సమస్య పరిష్కారం కావడంతో అంబేద్కర్ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి – భీమడోలు

భీమడోలు మండలంలో ఖరీఫ్ 2025–26 సీజన్‌కు ధాన్యం సేకరణకు ఏర్పాట్లు ప్రారంభించామని తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ధాన్యం సేకరణకు మండలంలో ప్రత్యేకించిన భీమడోలు, పూళ్ల రైస్ మిల్లులను సందర్శించారు. ధాన్యం సేకరణ కేంద్రాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేసిన గోనెసంచుల నాణ్యతను పరిశీలించారు.


విద్యుత్ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి – నిడమర్రు

విద్యుత్ ఉద్యోగ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు కోరారు. నిడమర్రు, భువనపల్లి ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరుతూ 17న జరుగుతున్న సమ్మెలో విద్యుత్ రంగ కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక దాడులు

రూ.16.27 లక్షల జరిమానా


తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి – ముదినేపల్లి

ముదినేపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై ఉన్న మీటర్లను తనిఖీ చేశారు. విజిలెన్స్ ఇఇ సిహెచ్.వాసు ఆధ్వర్యంలో 46 బృందాలుగా ఏర్పడి చేసిన ఈ తనిఖీల్లో 452 సర్వీస్ మీటర్లలో అదనపు లోడ్ మొత్తానికి రూ.15.52 లక్షలు, ఎనిమిది సర్వీసులకు విద్యుత్ చౌర్యం చేసినందుకు రూ.75,694 వెరసి రూ.16.27 లక్షల జరిమానా విధించినట్లు గుడివాడ ఇఇ జివి.శ్రీనివాసరావు తెలిపారు.ఈ తనిఖీల్లో గుడివాడ డివిజన్ పరిధిలోని రూరల్ గుడివాడ ఎడిఇ పి.కిరణ్‌కుమార్, ముదినేపల్లి ఎఇఇ బి.పూర్ణచంద్రరావు, ఎడిలు, ఎఇఇలు పాల్గొన్నారు.

పాఠశాలలో బాలికా దినోత్సవం

ప్రజాశక్తి – ముసునూరు

ప్రతి బాలిక చదువుతో పాటు పరిజ్ఞానం కలిగి ఉండాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగుల నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి మంత్రి కృషి'

ప్రజాశక్తి – ముసునూరు

మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి ప్రజలు తీసుకెళ్లిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతారని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడులో ఇటీవల నిర్వహించిన గ్రామసభలో రైతులందరూ కలిసి తమ వ్యవసాయ భూములోకి వెళ్లేందుకు రోడ్డు సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు. బుధవారం రఘుబాబు ఆధ్వర్యంలో డిఇ కమల్‌కుమార్, ఎఇ, ఇతర శాఖ అధికారులతో ఆ రోడ్డును పరిశీలించి నివేదిక మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

'గ్రామాలాభివృద్ధికి కృషి'

గ్రామాలాభివృద్ధికి మంత్రి కొలుసు పార్థసారథి కృషి చేస్తున్నారని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని గుళ్లపూడి, బలివే, వేల్పుచర్ల, గుడిపాడు గ్రామాల్లో ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ, డిఇ కమలాకర్, పలు శాఖల అధికారుల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. గ్రామాలాభివృద్ధికి మంత్రి ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయించి కృషి చేయనున్నటట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాలకు సరిహద్దులు ఏర్పాటు

ప్రజాశక్తి – ముసునూరు

కొన్ని వారాల క్రితం మండలంలోని కాట్రేనిపాడులో పర్యటించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సరిహద్దులు నిర్మించి ఎవరివి వారికే కేటాయించాలని మంత్రి ఆదేశించారు. అధికారులు, నాయకులు సుమారు రూ.60 వేలు అంచనా అవుతుందని మంత్రికి తెలిపారు. దీంతో మంత్రి సొంత నగదు వెచ్చించి యుద్ధప్రాతిపదికన పని ప్రారంభించి గ్రామానికి సుమారు 300 సరిహద్దు రాళ్లు పంపి పని పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, సూర్యదేవర శ్రీనివాసరావు, గద్దల సుహాసిని మోహనరావు, బొమ్మకంటి శ్యామలరావు పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

స్కూటీ డిక్కీలో బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి – భీమడోలు

మండలంలోని గుండుగొలనులో బుధవారం చోటు చేసుకున్న చోరీలో రూ.నాలుగు లక్షల నగదు, పది కాసుల బంగారం అపహరణకు గురైనట్లు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గుండుగొలను సినిమా హాల్ సెంటర్‌లో నివాసం ఉంటున్న పెనుగంటి బుజ్జి గుండుగొలను యూనియన్ బ్యాంకులో కుదవబెట్టిన పది కాసుల బంగారాన్ని విడిపించుకున్నారు. దీంతో పాటు రూ.నాలుగు లక్షల నగదు సైతం నత ఖాతా నుంచి విత్ డ్రా చేశారు. వాటిని తీసుకుని తాను వచ్చిన స్కూటీలో భద్రపరిచి మార్గమధ్యంలో ఉన్న ఒక కర్రీ పాయింట్ వద్ద ఆగి దుకాణంలోకి వెళ్లారు. తిరిగి స్కూటీ వద్దకు వచ్చే సమయానికి స్కూటీ లోని నగదు, బంగారం కనిపించలేదు. దీంతో భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.


బైక్ ఢీకొని మహిళకు గాయాలు

ప్రజాశక్తి – ముదినేపల్లి

బైక్ ఢీకొని మహిళ గాయాలపాలైన ఘటన మండలంలోని కొత్తపల్లి సెంటర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపల్లికి చెందిన మద్దాల నాగమణి కుడి కాలు, కుడి చేతికి చిన్నప్పటి నుంచి పోలియో ఉంది. ఈ నెల 11వ తేదీ రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో పెరుగు ప్యాకెట్ తెచ్చుకునేందుకు కొత్తపల్లి సెంటర్ వద్ద ఉన్న కొట్టు వద్దకు వెళ్తుండగా బంటుమిల్లి నుంచి సింగరాయపాలెం వైపు వెళ్తున్న బైక్ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన నాగమణిని స్థానికులు 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి మంగళవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ కోతలు... తాగునీటి ఇబ్బందులు..!

మెతుకుమిల్లివారిగూడెం వాసుల అవస్థలు
నాలుగురోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు
విద్యార్థులకు తప్పని తంటాలు
అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు


బురద రంగులో నీరు

ప్రజాశక్తి – చింతలపూడి

మండలంలోని ఆ గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా, కరెంటు కోతలు, రోడ్డు లేకపోయినా ఎవరూ పట్టించుకోని దుస్థితి. మెతుకుమిల్లివారిగూడెం గ్రామంలో నాలుగు రోజులుగా కరెంటు కోతతో తాగునీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఉదయం నుంచి మోటార్ కరెంటు లేదని, తాగు నీరు రాలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వాటర్ ట్యాంకు మూడు నెలలగా శుభ్రం చేయడం లేదని, నీరు బురద రంగులో వస్తున్నాయని వాపోతున్నారు. పలు చోట్ల పైపులు లీక్ అవుతున్నాయని, ఈ సమస్యలపై అధికారులను అడిగినా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అసలు గ్రామానికి వచ్చి పరిశీలించడంలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఎంపిపి పాఠశాల విద్యార్థుల సమస్యలు

గత ఆరు నెలలుగా తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు వినియోగించుకోవడానికి కూడా నీరు లేని పరిస్థితి నెలకొందని మెతుకుమెల్లివారిగూడెం (ఆర్.కె.పురం) ఎంపిపి పాఠశాల విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల ఆయాలు బయట నుంచి నీరు తీసుకోస్తున్నారని, తాగునీరు అయితే వాటర్ బాటిల్తో ఇంటి వద్ద నుంచి తీసుకొస్తున్నామని విద్యార్థులు చెబుతున్నారు. వర్షం వస్తే పాఠశాల చుట్టు వర్షపు నీరు నిలిచిపోతుందని, పాఠశాల ప్రాంగణం అక్రమణకు గురైందని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెట్టినా అధికారులు ఇప్పటివరకు పట్టించుకోలేదని విద్యార్థులు, గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాల చుట్టూ బౌండ్రీస్ వేయమని అడిగినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని


అధ్వానంగా పాఠశాల ఆవరణం

విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి
కృష్ణ, మెతుకుమెల్లివారిగూడెం

గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. పాఠశాలలో సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అన్ని సమస్యలు పరిష్కరించాలి.

భాస్కర్, ఎంపిటిసి సభ్యులు, యర్రగుంటపల్లి

సమస్యలను నేను చాలా సార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లాను. కాని వారు పట్టించుకోవటం లేదు. పాఠశాల ప్రాంగణం చుట్టూ రెవెన్యూ అధికారులు సరిహద్దులు వేయాలని కోరినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలి.

అబ్దుల్ కలాం ఆశయాలు ఆదర్శం

పలుచోట్ల ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

నేటి తరం మాజీ రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు చెప్పారు. మండలంలోని లక్ష్మీపురం, ములగలంపల్లి పాఠశాలల్లో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాద్, ఎం.వెంకటేష్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమడోలు :సామాన్యునిగా జీవితాన్ని ప్రారంభించి అత్యున్నత స్థాయికి ఎదిగిన డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ఆదర్శప్రాయమని భీమడోలు ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పిల్లి బ్రహ్మారావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం భీమడోలు సంత మార్కెట్‌లోని డాగ్యురే, అబ్దుల్ కలాం వేదిక వద్ద అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు డి.శ్రీరామ్, డి.డేవిడ్, పివిఆర్.మూర్తి, డి.శ్రీను, ఎవి.నాగరాజు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని మద్దికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం 9 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు తొమ్మండ్రు యువరాజు, ఉపాధ్యాయులు కె.నవ్య, జె.పద్మ, బి.జాన్సన్, బి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : శాంతినగర్‌లో ఉన్న ఎంపీ మహేష్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, టిడిపి నాయకులు అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని అన్నవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విజయకుమారి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నాగరాజు మాట్లాడారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, దుర్గా మల్లేశ్వరరావు, ఫిలోమిన, శ్రీ మంగలక్ష్మి, జయకుమారి, జాస్మిన్, బివివిఎస్‌వి.ప్రసాద్, రాజేంద్రప్రసాద్, క్లస్టర్ రీసోర్స్ పర్సన్ రాంబాబు, ఎలిమెంటరీ స్కూల్ కుక్కలగూడెం ఉపాధ్యాయుడు హరిప్రసాద్, వ్యాయాయ ఉపాధ్యాయుడు రవీంద్ర పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు పట్నాల సోమశేఖర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ శివప్రసాద్, పాఠశాల సెక్రటరీ ఎంఎ.నబి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తేరా ప్రసాద్‌కు డిఇఒ, యుటిఎఫ్ సత్కారం

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్‌లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తేరా ప్రసాద్‌ను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు, జిల్లా సిఇఒ బోర్డు సెక్రటరీ సర్వేశ్వరరావు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఫణికుమార్, ఉపాధ్యాయురాలు తల్లాడ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

ఇటీవల కాలంలో చోటు చేసుకున్న కల్తీ మద్యం ఘటనల నేపథ్యంలో నూజివీడు స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపులను పూర్తిగా తనిఖీ చేసి శాంపిల్స్ సేకరించినట్లు ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య బుధవారం తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యాప్ ద్వారా మద్యం షాపులపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. స్టేషన్ సిబ్బందికి నిర్దిష్టంగా షాపులను కేటాయించి, ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా ప్రతిరోజూ వాటిపై పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు.

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి – టి.నరసాపురం

ఉపాధి హామీలో జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతిఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ జి.మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో నూతనంగా జరిగిన మార్పులపై బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీలో ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి శ్రామికులు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఆర్ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి – భీమడోలు

గుండె, శ్వాసకోశ అనారోగ్య ఇబ్బందులు ఏర్పడినప్పుడు తొలుత అరగంటలో అందించే ప్రాథమిక ప్రత్యేక వైద్య సేవలు ప్రాణాలను కాపాడతాయని పూళ్ల పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మణరావు తెలిపారు. పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్‌సెంటర్–2 వద్ద కార్డియో పల్మనరీ రెసిటేషన్ (సిపిఆర్) చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని ఆరోగ్య విస్తరణ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పిహెచ్‌సి పర్యవేక్షకులు శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటేలా తర్ఫీదు ఇవ్వాలి

ప్రజాశక్తి – మండవల్లి

డివిజన్ స్థాయిలో నిర్వహించే ఆటల పోటీల్లో సత్తా చాటేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఎంఇఒ–1 సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో పీడీలతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17న డివిజన్ స్థాయిలో గుడివాడలో నిర్వహించే ఆటల పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. అనంతరం నూతనంగా నియామకమైన పీడీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీడీలు వేణుబాబు, సత్యనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

పట్టణంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తిరువూరు రోడ్డులోని లారీ అసోసియేషన్ హాల్ ప్రాంగణంలో అధికారుల బృందం బుధవారం స్థలాలను పరిశీలించారు. బాణసంచా షాపుల ఏర్పాటుకు అనువైన స్థలముగా నిర్ధారించారు. తహశీల్దార్ బద్రునాయక్, ఎస్ఐ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, అగ్నిమాపక అధికారి జి.నాగరాజు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మార్కెట్ యార్డ్‌లో తాత్కాలిక లైసెన్స్ పొందిన క్రాకర్స్ దుకాణాలను రెవెన్యూ, పంచాయతీ, అగ్నిమాపక శాఖాధికారులతో కలిసి ఎస్ఐ పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది సూచించిన విధంగా అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని దుకాణ యజమానులకు సూచించారు.

సార్ వచ్చారు.. వెళ్లారు..!

సమస్యకు పరిష్కారం చూపలేదని చేవూరు వైఎస్ఆర్ కాలనీవాసుల విమర్శ


చెరువు గట్టున పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి – ముదినేపల్లి


సార్ వచ్చారు. వెళ్లారు గాని ఒరిగిందేమీ లేదంటూ మండలంలోని చేవూరు వైఎస్ఆర్ కాలనీవాసులు అంటున్నారు. మంగళవారం కాలనీవాసులు తమకు ముంపు సమస్య పరిష్కరించాలంటూ రాస్తారోకో చేయగా తహశీల్దార్ గ్రామ సర్పంచికి ఫోన్ చేసి బుధవారం వచ్చి ముంపు సమస్య పరిశీలించి పరిష్కరిస్తానని, రాస్తారోకో విరమించాలని కోరారు. సర్పంచి ఆందోళనకారులకు విషయం చెప్పి రాస్తారోకో విరమింపచేశారు. బుధవారం ఉదయం పది గంటల సమయంలో కాలనీకి తహశీల్దార్ రావడంతో పెద్ద సంఖ్యలో కాలనీవాసులు తమ సమస్యను చెప్పుకునేందుకు గుమ్మి గుడారు. అయితే తహశీల్దార్ అందరూ దూరంగా ఉండాలని చెప్పి తనతో పాటు ముగ్గురిని తీసుకెళ్లి చేపల చెరువుల గట్టును పరిశీలించారు. కాలనీవాసులు ఆయనను కలిసి మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన అవకాశం ఇవ్వలేదు. అరగంట పాటు కాలనీలో, చెరువు గట్ల వెంట తిరిగి పెట్రోల్ బంక్ వరకు వెళ్లి పరిశీలించి వెళ్లిపోయారని కాలనీ వాసులు చెప్పారు. కాలనీ ముఖద్వారం నుంచి దిగువకు ఉన్న పాత బోదె రికార్డుల్లో లేదని, దిగువ నుంచి ఎగువకు బోదే ఏర్పాటు చేసేలా చేస్తానని తహశీల్దార్ అన్నట్లు కాలనీ వాసులు తెలిపారు. అయితే దిగువ నుంచి ఎగువకు మురుగునీరు పోదని ఆ ప్రకారం అయితే తమకు వద్దంటూ కాలనీ వాసులు చెప్పారు. దీంతో తహసిల్దార్ గురువారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో జరిగే సమావేశానికి కాలనీవాసులు, రైతులు హాజరు కావాలని చెప్పి కారెక్కి వెళ్లిపోయినట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. సార్ వచ్చారు... వెళ్లారే తప్ప సమస్య పరిష్కారానికి మార్గం చూపలేదంటూ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణీత్‌కు 15 రోజుల్లో కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి

తహశీల్దార్‌ను ఆదేశించిన ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

కుంజా ప్రణీత్‌కు 15 రోజుల్లో కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని తహశీల్దార్‌ను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆదేశించారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎంఎల్ఎ తహశీల్దార్ కార్యాలయం ఎదుట కొన్ని రోజులుగా కుల ధ్రువీకరణ పత్రం కోసం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న కుంజా ప్రణీత్‌ను గమనించి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో ఎంఎల్ఎ వెంటనే రెవెన్యూ ఆఫీసర్‌కు, ఆర్‌డిఒకు ఫోన్ చేసి వివరణ అడగగా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని స్థానిక తహశీల్దార్‌కు


ప్రణీత్‌కు నిమ్మరసం ఇస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

తెలియపరిచామని వారు చెప్పారు. దీంతో ఎంఎల్ఎ తహశీల్దార్‌కు ఫోన్ చేసి 15 రోజుల్లో కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఆదేశించారు. నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న ప్రణీత్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కుల ధ్రువీకరణ పత్రం వస్తుందని, అధైర్య పడవద్దని చెప్పారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

జనసేన మండలాధ్యక్షులు మధుబాబు


ఆర్థిక సాయం అందిస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి – చింతలపూడి

కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటామని జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. మండలంలోని ప్రగడవరంలో జనసేన క్రియాశీల సభ్యులు నరసింహారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబానికి మధుబాబు ఆధ్వర్యంలో ప్రగడవరం నాయకులు, వీర మహిళలు రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగడవరం గ్రామ అధ్యక్షులు కొసన చంద్రబాబు, గ్రామ సెక్రటరీ గరిగంటి సీతారామయ్య, గ్రామ కార్యదర్సులు తోట దుర్గాప్రసాద్, నల్లగొపు సూర్యచంద్రరావు, తూము కృష్ణ, వెంకన్నబాబు, గ్రామ ప్రధాన కార్యదర్శి చిలక చెన్నారావు, సీనియర్ నాయకులు నల్లగొపు లక్ష్మీనారాయణ, మేనేని విజయ్, పిదపర్తి సతీష్‌రెడ్డి, పోతునూరు చైర్‌పర్సన్ సీతల గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి – భీమడోలు

భీమడోలు జంక్షన్ నుంచి జాతీయ రహదారిని అనుసంధానం చేసే రోడ్డు భవనాల శాఖకు చెందిన రోడ్డు శిథిలమై గోతులతో నిండింది. జనసేన కార్యకర్తలు, ఇతర కూటమి నాయకులు, ఆ పార్టీ మండలాధ్యక్షులు పత్తి మదన్ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తి మదన్ మాట్లాడుతూ గోతులను పూడ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించినప్పటికీ వారు సాకులు చూపి పనులు చేపట్టలేదని తెలిపారు. కొన్ని నెలల క్రితం ఇదే రోడ్డుకు రూ.లక్షలతో మరమ్మతులు చేసినా నాణ్యతా ప్రమాణాలు లేని కారణంగా కొద్దికాలంలోనే రోడ్డు పాడయ్యాయని తెలిపారు.

జిఎస్‌టిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి – భీమడోలు

పర్యాటక రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో, తగ్గిన జిఎస్‌టితో ధరల కారణంగా మరింతమంది ఈ రంగం సేవలను వినియోగించుకునే అవకాశం ఉందని, వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలులోని పర్యాటకులను ఆదరిస్తున్న మార్గ మధ్యంలో వారు సేద తీరేందుకు సహకరిస్తున్న జాతీయ రహదారిపై ఉన్న సాయిబాబా ఆలయం వద్ద జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ శేషగిరితో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం భీమడోలు పురవీధుల్లో ర్యాలీని నిర్వహించారు.

విద్యార్థుల వినూత్న కార్యక్రమం

భీమడోలు హైస్కూల్ విద్యార్థులు జిఎస్‌టిపై నిర్వహించిన వినూత్న కార్యక్రమం పలువురుని ఆకట్టుకుంది. దీనిలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, సహ



భీమడోలులో అవగాహనా ర్యాలీ

ఉపాధ్యాయులు అహమ్మద్ పర్యవేక్షణలో విద్యార్థులు విద్య, ఆరోగ్యం, వ్యాపార రంగాల్లో తగ్గిన జిఎస్‌టి కారణంగా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. తగ్గిన జిఎస్‌టిని బాధ్యులు అమలు చేయని కారణంగా ప్రజలు పడుతున్న ఇక్కట్లు వారు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులు బాధ్యులను ప్రశ్నించి సదరు లోపాలను సరి చేసే విధానాల గురించి, ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలపై ప్రదర్శించిన లఘు నాటికలు పలువురిని ఆకట్టుకున్నాయి.

మండవల్లి : మండవల్లిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపిడిఒ యద్దనపూడి రామకృష్ణ మాట్లాడారు. అనంతరం తగ్గించిన జిఎస్‌టి కరపత్రాలను ప్రదర్శించారు.

ఎస్‌సిల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి ఏలూరు సిటీ

పశ్చిమ గోదావరి జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఏలూరు వారిచే ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకం 2023–24 సంవత్సరంలో ఎంపికైన అభ్యర్థులకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్‌చే సెప్టిక్‌ట్యాంకు తోడు మెషిన్లు, వాక్యూమ్ బేస్డ్ డిస్లడ్జింగ్ మూడు వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాహనాలు అందించారు. భీమవరం వారికి కేటాయించిన వాహనపు లబ్ధిదారులు బకాయిలను చెల్లించకపోవడంతో సదరు వాహనాలను కార్యాలయానికి తిరిగి అప్పగించేందుకు అంగీకరించారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఆసక్తి కలిగిన ఐదుగురు గ్రూపు సభ్యులకు ఏలూరు కార్పొరేషన్, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు మున్సిపాలిటీలకు చెందిన అభ్యర్థుల ద్వారా సదరు వాహనాన్ని కేటాయించేందుకు దరఖాస్తులు కోరుతన్నారు. ఆసక్తి కలిగిన ఎస్‌సి సామాజికి తరగతికి చెందిన అభ్యర్థులు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తులను ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయపు పని వేళల్లో అందించాలి.

వైట్ కేన్ దినోత్సవం

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

ఏలూరులో వైట్ కేన్ దినోత్సవ వేడుకలను బుధవారం జన్మభూమి పార్క్ వద్ద ఉన్న యాదవ సంఘం సమావేశ మందిరంలో విజువల్లి ఛాలెంజ్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్.హరనాథ్, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజువల్లి ఛాలెంజెడ్ డిపార్ట్‌మెంట్ అధ్యక్షులు వీరభద్రరావు, ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు.

దెందులూరు :అంధులు (దృష్టి లోపం ఉన్నవారు) తమ రోజువారీ జీవితంలో స్వాతంత్ర్యంగా ఆత్మవిశ్వాసంతో సురక్షిత ప్రయాణాన్ని సాధించేందుకు తెల్ల చేతికర్ర దోహదపడుతుందని అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. ప్రపంచ తెల్ల చేతికర్ర దినోత్సవం అవగాహన సదస్సు ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నేత్ర వైద్యం విభాగంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ అరుణ హాజరయ్యారు.

ఇ-పంట నమోదుపై సమీక్ష

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

మండల పరిధిలోని తుక్కులూరులో ఉన్న రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ రైతు సేవా కేంద్ర సిబ్బందితో ఇ–పంట నమోదుపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ పంట నమోదు మండలంలో 98 శాతం పూర్తి చేశామని, మిగిలిన విస్తీర్ణం కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంట సాగు చేయకుండా ఖాళీగా ఉన్న పంట భూములను ఇ పంటలో ఈ నెల 25 తేదీ లోగా నమోదు చేయాలన్నారు. అనంతరం నూజివీడు మార్కెట్ యార్డ్‌లో ఉన్న భూసార పరీక్షా కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.